వలంటీర్లు సేవారథులు

- పథకాలను ప్రజలకు అందించడంలో కీలకం
- వారి సేవలు అభినందనీయం


పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్న ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి వలంటీర్ల నియామకం చేపట్టారు. వారి ద్వారా సంక్షేమ పథకాలను పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలకు అత్యుత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా వజ్ర (రూ.30 వేలు), సేవా రత్న (రూ.20 వేలు), సేవా మిత్ర (రూ.10వేలు) పురస్కారాలతో గౌరవిస్తున్నారు. సేవావజ్ర పురస్కారాలను సాధించిన వలంటీర్ల మనోభావాలు వారి మాటల్లోనే...

సీఎం జగన్ ఆశయ సాధనకు కృషి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా ఉత్తమ సేవలు అందించడం మా ధ్యేయం. నెల మొదటిరోజే వృద్ధులకు పింఛన్ అందజేయటం చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్ ఆశయాలను నెరవేర్చేందుకు వలంటీర్‌గా నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను.

– కొల్లి శశికళ, సేవా వజ్ర, వలంటీర్, గ్రామసచివాలయం–2, కడియపులంక

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలను ప్రజలకు నేరుగా అందించాలనే ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు వలంటీర్లను ఏర్పాటు చేశారు. సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు అందిస్తున్నాం. మా సేవలను గుర్తించి పురస్కారాలు, నగదు ప్రోత్సాహకాలు అందించడం ఎంతో ఆనందంగా ఉంది. వలంటీర్ల కృషిని గుర్తించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– బయ్యల విజయకుమార్, సేవావజ్ర, వలంటీర్, గ్రామ సచివాలయం–3, ధవళేశ్వరం

సేవలకు గుర్తింపు



ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికీ అందజేసేందుకు మావంతు బాధ్యత నిర్వరిస్తూ ఉంటాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు అన్ని పథకాలు చేరువచేయటమే మా ప్రధాన కర్తవ్యం. దళారులు ఎవరూ లేకుండా నేరుగా సచివాలయాల్లో దరఖాస్తు చేయడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుబాటులోకి తీసుకురావడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనం. సేవావజ్ర పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– సుంకర సురేష్, సేవావజ్ర, వలంటీర్, గ్రామ సచివాలయం –2, దుళ్ల

ప్రజలకు వారధి



అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారధిలా పని చేయటం, ప్రజలకు మెరుగైన రీతిలో ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు చేరేలా చూడడం మా బాధ్యత. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నాం. అన్ని వర్గాల ప్రజలుకు మేలు చేయడమే ప్రభుత్వం ఉద్దేశం. వలంటీర్లు వాటిని అమలు చేయటం సంతృప్తినిస్తోంది. సేవా వజ్ర పురస్కారానికి ఎంపిక కావటం సంతోషంగా ఉంది.

– దొడ్డి మోహనకీర్తి, సేవావజ్ర, వలంటీర్, 45వ వార్డు సచివాలయం, ఆల్కాట్‌తోట, రాజమహేంద్రవరం

కట్టుబడి ఉన్నాం



రాష్ట్రంలోని పేదలందరికీ అన్నగా, మామయ్యగా అనుబంధాలను పంచుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సేవచేస్తున్నందుకు గర్వంగా ఉంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా సర్వేలు చేపట్టి నిజమైన అర్హులకు న్యాయం చేస్తున్నాం. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లకు సమాజంలో గుర్తింపు, గౌరవాన్ని ఇచ్చారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవ చేస్తున్న మమ్మల్ని గుర్తించి అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉంది.

– తాడి వనిత కుమారి, సేవావజ్ర, వలంటీర్, గ్రామసచివాలయం–3, కోలమూరు

పోస్టల్ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలి


సమావేశంలో పాల్గొన్న ఉద్యోగుల సంఘం నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: తపాలా శాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న జాతీయ తపాలా ఉద్యోగుల సమాఖ్య, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు ఆర్డరును వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రజా సంఘాల సమన్వయ కమిటీ, కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు, భారత తపాలా ఉద్యోగుల సంఘం డిమాండ్ చేశాయి. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద గురువారం మధ్య తరగతి, ప్రజా సంఘాల సమన్వయ కమిటీ, కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పలు యూనియన్ల నాయకులు మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన నూతన రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమానికి ఆర్థిక సహాయం చేశారన్న కారణంగా రెండు యూనియన్ల గుర్తింపు రద్దు చేయడం అప్రజాస్వామికమన్నారు. స్వాతంత్రానికి ముందే తపాలా ఉద్యోగ సంఘాలు హక్కుల కోసం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేశాయన్నారు. 80 శాతం ఉద్యోగులు సభ్యులుగా ఉన్న ఈ రెండు యూనియన్ల గుర్తింపు రద్దు చేయటం అన్యాయమన్నారు.

లైఫ్ కనెక్ట్ చారిటబుల్ ట్రస్టు ప్రారంభం


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్టు వ్యవస్థాపకుడు నాగేంద్ర

రాజమహేంద్రవరం సిటీ: లైఫ్ కనెక్ట్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతి నెలా సేవా కార్యక్రమాలు నిర్వహించి, పేదలకు చేతనైనంత మేరకు సహాయ, సహకారాలు అందిస్తామని ట్రస్టు వ్యవస్థాపకుడు పప్పుల నాగేంద్ర అన్నారు. గురువారం స్థానిక అన్నపూర్ణమ్మపేటలోని ఆయన నివాసం వద్ద పేద మహిళలకు చీరలు పంపిణీ చేసి, ట్రస్టు కార్యకలాపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది మహిళలకు చీరలు అందజేశారు. నాగేంద్ర మాట్లాడుతూ లైఫ్ కనెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి జీవితాలతో కనెక్ట్ కావాలనే ఆకాంక్షతో ఈ చారిటబుల్ ట్రస్టును ప్రారంభించామన్నారు. ప్రతి పేద కుటుంబానికి తమ ద్వారా సాయం అందించేందుకు ఒక కార్డు ఇస్తామన్నారు. తన కుటుంబం, మిత్రులు చారిటబుల్ ట్రస్ట్ కార్యకలాపాల్లో సహకారాలు అందిస్తున్నారన్నారు. నాగేంద్ర మిత్ర బృందం ప్రకాష్, చిన్న, గాంధీ, విష్ణు, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


శీలంశెట్టి శ్రీనివాసరావు (ఫైల్)

ధవళేశ్వరం: ఆర్థిక ఇబ్బందులతో టీడీపీ నాయకుడు శీలంశెట్టి శ్రీనివాసరావు (52) ఆత్మహత్య చేసుకున్నాడు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధవళేశ్వరం కొత్తూరు వీధికి చెందిన శీలంశెట్టి శ్రీనివాసరావు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 14వ తేదిన భార్యా పిల్లలను తిరుపతికి పంపించాడు. 16వ తేదీ ఉదయం ఇంట్లో ఉన్న పచ్చగడ్డి మందును తాగాడు. వాంతులు అవ్వడంతో అన్నయ్యకు ఫోన్ చేశాడు. దీంతో శ్రీనివాసరావును రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం ధవళేశ్వరంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు శ్రీనివాస్ ఏఎంసీ వైస్ చైర్మన్‌గా, టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన మృతికి వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


దేవీచౌక్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్



రోడ్లను తడిపేందుకు ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ

- ఎంపీ భరత్‌రామ్
- చలివేంద్రాల ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: వేసవి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ కోరారు. గురువారం ఓఎన్జీసీ ఆధ్వర్యంలో రూ.10 లక్షల సీఎస్సార్ నిధులతో నగరంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో భాగంగా దేవీచౌక్ ప్రాంతంలో చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ నగరంలో ప్రజల దప్పిక తీర్చేందుకు ఓఎన్జీసీ, గెయిల్, దేవదాయశాఖ, వివిధ ఆలయాల ట్రస్ట్ బోర్డులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు మానవత్వంతో ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అత్యవసరమైతే తప్ప ఎవ్వరూ బయటకు రావద్దని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు వహించాలన్నారు. ఇప్పటికే నగరంలో 30కి పైగా చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, మరో ఇరవై ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రోడ్లను తడిపే కార్యక్రమం

భూతాపం నుంచి ఉపశమనం కల్పించేందుకు రోజూ ఉదయం 10 గంటల్లోగా రోడ్లను నీటి ట్యాంకర్లతో తడిపే కార్యక్రమం ప్రారంభించినట్టు ఎంపీ తడిపారు. ఓఎన్జీసీ ఈడీ అసిస్టెంట్ మేనేజర్ అమిత్ నారాయణ మాట్లాడుతూ వేసవిలో ఏటా ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో సహాయక చర్యలు చేపడుతున్నామన్నారు. ఎంపీ భరత్ రామ్ కోరిక మేరకు నగరంలో రూ.10 లక్షలతో ఈ వేసవిలో చలివేంద్రాల ద్వారా మజ్జిగ, తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని, పుష్కర ఘాట్ గౌతమీ జీవకారుణ్య సంఘం వద్ద చందా సత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎంపీ భరత్ రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లను బ్యాంకు పాలకవర్గం పంపిణీ చేసింది. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సీఈఓ స్వరాజ్యలక్ష్మి, గిరజాల బాబు, టీకే విశ్వేశ్వర రెడ్డి, బర్రె కొండబాబు, ఓఎన్జీసీ చీఫ్ జనరల్ మేనేజర్ నేవెడ్ రావు, డీజీఎం హెచ్ ఆర్ అండ్ ఇన్‌చార్జి సీఎస్ఆర్ ఎం.శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ సాంబశివరావు, ఎంహెచ్ఓ వినూత్న, వాటర్ సప్లై డీఈ చంద్రశేఖర్, డీఈ ప్రసాద్, వాటర్ సప్లై ఏఈ భవాని పాల్గొన్నారు.

చదరంగంతో ఏకాగ్రత


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చదరంగంతో పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుందని కోచ్ కంచుమర్తి జగన్నాథం అన్నారు. స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో గురువారం రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగాయి. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, హ్యాండ్ క్రాఫ్ట్, చిత్రలేఖనం, చదరంగం, తెలుగు పద్యాలు, లలిత సంగీతం తరగతులు నిర్వహించామని లైబ్రేరియన్ శ్రీదేవి తెలిపారు. చెస్ కోచ్ జగన్నాథం విద్యార్థులకు చదరంగంలో మెళకువలు నేర్పించారు. దవళ రాజేంద్ర శ్రవణ్ కుమార్ విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు.

బిందు సేద్యంతో నాణ్యమైన దిగుబడి


డాక్టర్ రామమోహన్

రాజమహేంద్రవరం రూరల్: వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటిన తరుణంలో బిందుసేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ, నాణ్యమైన పంట దిగుబడిని పొందవచ్చని జిల్లా మైక్రో ఇరిగేషన్ పథక సంచాలకులు డాక్టర్ ఎస్.రామమోహన్ గురువారం ప్రకటనలో తెలిపారు. నీటిలో కరిగే ఎరువులను ఫెర్టిగేషన్ విధానం ద్వారా అందించడం వల్ల ఎరువుల ఖర్చు తగ్గుతుందన్నారు. ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి పంట దిగుబడి, నాణ్యత మెరుగవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకంలో తూర్పుగోదావరి జిల్లాకు 2023 –24 సంవత్సరానికి 3000 హెక్టార్లు భౌతిక లక్ష్యంగా నిర్దేశించామన్నారు. బిందు, తుంపర సేద్య పరికరాలను ప్రభుత్వ రాయితీపై పొందాలనుకునే రైతులు సమీప రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధిద్దాం


సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 30 లోపు ర్యాంకు సాధించే లక్ష్యంగా నగరంలో పారిశుధ్యం నిర్వహించాలని కమిషనర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నగర పాలకసంస్థ కార్యాలయంలో శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు, సూపర్ వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గార్బేజ్ ఫ్రీ సిటీ అసెస్మెంటులో త్రీస్టార్ రేటింగ్ సాధించాలన్నారు. దీనికి సంబంధించిన విధి విధానాలపై శిక్షణ ఇస్తామన్నారు. నగరంలో తిరుగుతున్న పశువులను ఎప్పటికప్పుడు గోశాలకు తరలించాలని, వాటి యజమానులకు గట్టి హెచ్చరికలు చేయాలని ఆదేశించారు. బల్క్‌గా గార్బేజ్ ఉత్పత్తి చేసే వారితో కంపోస్టింగు చేయించాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో రాజీపడవద్దని, ప్రజలకు మెరుగైన జీవన పరిస్థితులు అందించేలా అందరూ కృషి చేయాలన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం


ర్యాలీని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై కార్మిక శాఖ, ఇతర శాఖల సహకారంతో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ఆరు నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య పొందడం వారికి రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. పిల్లలను కార్మికులుగా మార్చడం నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో భాగంగా కొన్ని బృందాలను ఏర్పాటు చేసి పట్టణంలోని పలు ప్రాంతాలలో తనిఖీ చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలకు సంబంధించిన నివేదికను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందించాలన్నారు.

విద్యాదానం మహోన్నతం



బోధనా సామగ్రిని అందజేస్తున్న కొయ్యన కుమారి

రాజమహేంద్రవరం రూరల్: విద్యాదానం మహోన్నతమైందని లయన్స్ క్లబ్ రాజమండ్రి మహిళ సెక్రటరీ కొయ్యన కుమారి అన్నారు. కొంతమూరులోని గ్రేస్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో గురువారం వయోజన విద్య టీచర్లకు బోధనా సామగ్రి పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఫౌండర్ డాక్టర్ రోషన్ వర్గీల్ మాట్లాడుతూ చెన్నైకి చెందిన లిట్రసి ఇండియా ట్రస్ట్ సౌజన్యంతో గ్రేస్ చారిటబుల్ ట్రస్టు ద్వారా 15 వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభం అవుతున్నాయన్నారు. ముఖ్యంగా చెంచు, మందుల, యానాది వర్గాలలో నిరక్షరాస్యత ఉందని, ఈ కేంద్రాల ద్వారా వారిని 10 నెలలలో అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హరితదళం సంస్థ మేనేజర్ యార్లగడ్డ చిట్టిబాబు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలోని గ్రామీణ ప్రాంతాలైన చెంచు కాలనీ, రాయుడు పాకలు, సంతోష్ నగర్, శాటిలైట్ సిటీ, గంగిరెడ్డుల కాలనీ మొదలగు ప్రాంతాలలో ఈ వయోజన విద్యాకేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా 15 మంది టీచర్లకు పలకలు, పుస్తకాలు, బ్లాక్ బోర్డులు అందజేశారు.

గ్రంథాలయంలో శిక్షణ తరగతులు

ప్రకాశం నగర్: దానవాయిపేట మహిళా గ్రంథాలయం, శాఖా గ్రంథాలయాలలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు గురువారం 11వ రోజుకు చేరుకున్నాయి. డ్రాయింగ్ మాస్టార్ వినోద్ కుమార్ అక్షరాలతో చెట్టు వేయడం నేర్పించారు. విశ్రాంత తెలుగు పండిట్ ఎం.సూర్య నారాయణ విద్యార్థులకు నీతి కథలు, తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు.

క్లుప్తంగా

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ప్రకాశం నగర్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక ఆనాల వెంకట అప్పారావు రోడ్డులోని స్పిరిట్ క్లబ్ అండ్ కిచెన్స్‌లో మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు పేరిట నిర్వహించిన ఓపెన్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ చాంపియన్‌షిప్ 2023 ముగింపు వేడుకలు గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విజేతలకు బహుమతులు అందజేశారు. మనోజ్ రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్‌ను నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, రాష్ట్ర బిలియర్డ్స్ స్నూకర్ అసోసియేషన్ కార్యదర్శి సోమేశ్వర రావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ఎంఎస్ఆర్ ఫాలోవర్స్ ఆధ్వర్యంలో బీసీ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు కాటం సంజయ్ కాంత్ (షాన్) నేతృత్వంలో స్థానిక నందం గనిరాజు జంక్షన్‌లో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమానికి రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుదే రఘు నరేష్, మేడపోయిన సునీల్, మైనార్టీ నాయకులు ఎస్‌కే షరీఫ్, ఎస్‌కే బాషా, ఎంఎస్ఆర్ ఫాలోవర్స్ సభ్యులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

రాజమహేంద్రవరం సిటీ: పెట్రోల్ బంకుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, గాలి, నీరు, మరుగుదొడ్లు తదితర వసతులను ప్రజలకు ఉచితంగా అందించేందుకు కృషి చేయాలని డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు అన్నారు. పెట్రోల్ బంకులపై పలు ఫిర్యాదుల నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఆదేశాల మేరకు గురువారం రాజమహేంద్రవరంలోని పలు పెట్రోల్ బంకుల్లో తనిఖీ చేపట్టారు. జిల్లా లీగల్ మెట్రోలాజీ అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు, మండల సప్లై ఆఫీసర్ ప్రభాకర్ పాల్గొన్నారు. శామ్యూల్ రాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని బంకుల్లో ఆధునిక టెక్నాలజీ ద్వారా మీటర్లు అమర్చబడ్డాయని, వినియోగదారులు అపోహలు నమ్మవద్దన్నారు.

సిల్ట్ తొలగింపు పనుల పరిశీలన


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలం ప్రారంభానికి ముందే మురుగు కాలువల్లో సిల్ట్ తొలగించే ప్రక్రియ నూరుశాతం పూర్తి కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. కోటిపల్లి బస్టాండ్, కుమారి టాకీస్ రోడ్, గోదావరి గట్టు, దేవీచౌక్ ప్రాంతాల్లో జరుగుతున్న డీ సిల్టేషన్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ వినూత్న పాల్గొన్నారు.

విద్యార్థినికి వాచ్ బహూకరణ


విద్యార్థిని అమృతవర్షిణికి వాచ్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ వాణికుమారి

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి ఇచ్చిన నగదుతో గురువారం బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల పదోతరగతి టాపర్‌కు వాచ్‌ను బహూకరించినట్టు ప్రిన్సిపాల్ ఏ.వాణికుమారి తెలిపారు. గత నెల 11వ తేదీన గురుకుల బాలికల పాఠశాలను విజయప్రతాప్ రెడ్డి సందర్శించారు. ఆ సమయంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి వాచ్ కొనివ్వాలని ప్రిన్సిపాల్ వాణికుమారికి రూ.1500 ఫోన్‌పే చేశారు. దీంతో ఆ సొమ్ముతో ప్రిన్సిపాల్ వాచ్‌ను కొనుగోలు చేసి పదో తరగతి పరీక్షల్లో 558 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన అమృతవర్షిణికి అందజేశారు.

20 నుంచి పుష్కర బ్రహ్మోత్సవాలు

సీటీఆర్ఐ: లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రంలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి పుష్కర బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకుడు శ్రీమన్నారాయణస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. ఆలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తయ్యి, 13వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకూ మూడు రోజులు ఉత్సవాలను నిర్వహిస్తారన్నారు. 20న విష్ణు సహస్ర నామ పారాయణ, 21న సామూహిక సహస్రనామ కుంకుమార్చన, 22న నిత్యవిధి, 23న శ్రీపుష్ప యాగం జరుగుతాయన్నారు.

వ్యవసాయ కళాశాల డీన్ నాయక్‌కు సత్కారం

కంబాలచెరువు: వ్యవసాయ కళాశాల నూతన భవనాలను కాతేరులోని వ్యవసాయక్షేత్రంలో నిర్మించడానికి కృషి చేసిన అగ్రికల్చరల్ కాలేజీ రాజమండ్రి అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్ రాజ్‌నాయక్‌ను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ నాయకుడు కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్యామరాజ్ నాయక్ మాట్లాడుతూ అన్నపూర్ణగా గుర్తింపు పొందిన ఉభయ గోదావరి జిల్లాలకు వ్యవసాయ కళాశాల ఎంతో ప్రాముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, ఎన్.వెంకట రామయ్య, తాళ్లూరి రవిరాయల్, పులుమాటి బాబూరావు, ఉసురుమర్తి రామారావు, పులిదుండి ఆనందకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ


ఆకట్టుకున్న వేషధారణలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్న ఆంజనేయ స్వామి జయంత్యుత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారి రజిత విగ్రహం ఊరేగింపు, పల్లకీ సేవ వైభవంగా జరిగాయి. కేరళ డ్రమ్ముల వాయిద్యం, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఈ కార్యక్రమం జరిగింది. వర్తక సంఘ సభ్యులు, రైల్వే ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కార్యక్రమానికి తరలివచ్చిన పూర్వవిద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2019–20 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులందరూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించిన బొల్లిన సతీష్, సీహెచ్ రవికిషోర్, సుంకవల్లి శ్రీధర్, మారెడ్డి రాజశేఖర్, కొండా వేణును స్నేహితులందరూ అభినందించారు. జయ, ఉమ, శిరీష, ప్రభ, ఆదిలక్ష్మి, ప్రకాష్, రాజేంద్ర, రాంబాబు, మధు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల :	అన్ని మంచి శకునమలే
సూర్యమినీ :	గార్డియన్స్ ఆఫ్ దిగెలాక్సీ
సూర్యప్యాలెస్ :	ఫాస్ట్అండ్‌ఫ్యూరియస్10
స్వామి :	బిచ్చగాడు–2
శివజ్యోతి :	కస్టడీ
అనుశ్రీ :	విరూపాక్ష
రాజా :	ఫాస్ట్అండ్‌ఫ్యూరియస్10
అశోక :	ఉగ్రం
ఊర్వశి :	పీఎస్–2
రంభ :	ది కేరళస్టోరీ
మేనక :	రామబాణం
అప్సర :	ఫాస్ట్అండ్‌ఫ్యూరియస్10
నామవరం	
వీఎస్ మహల్ :	బిచ్చగాడు–2
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఫాస్ట్అండ్‌ఫ్యూరీయస్–10
కడియం	
వెంకటసూర్య :	బిచ్చగాడు–2